సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 6 । ఏప్రిల్ । 2023



రూ.2 వేలు ఇవ్వలేదని హత్య

కేవలం రూ.2 వేలు అప్పు ఇవ్వలేదనే కక్షతో జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో ఒక వ్యక్తి తన స్నేహితుడిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. 8లో



వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో

వేసవి దుక్కుల వల్ల భూసారం పెరగడమే కాకుండా భూమికి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో



గర్భిణి హత్య కేసులో భర్త అరెస్టు

వేలేరుపాడు మండలం పాతరెడ్డిగూడెంలో గర్భిణి హత్య కేసులో భర్తను అరెస్టు చేశారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నందుకే హత్య చేసినట్లు అంగీకరించాడు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సహరి (శుక్రవారం వేకువజాము)
భీమవరం	6.25	4.34
తాడేపల్లిగూడెం	6.26	4.42
నరసాపురం	6.24	4.33

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య

- పేద విద్యార్థుల కోసం 25 శాతం సీట్ల రిజర్వేషన్
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్లకు గడువు
- ఉచిత విద్య అందించేందుకు ముందుకొచ్చిన 250 స్కూళ్లు



సాక్షి, భీమవరం: విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించేందుకు చర్యలు చేపట్టింది. ఒకప్పుడు ఉన్నత వర్గాలకు మాత్రమే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదువుకునే అవకాశముండేది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో ఆయా విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులకు పైసా ఖర్చులేకుండా పూర్తిగా ప్రభుత్వమే ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 358 ప్రైవేటు స్కూళ్లు ఉండగా.. ఆయా స్కూళ్లలోని సీట్ల సంఖ్యలో 25 శాతం ఉచిత విద్యకు కేటాయించాల్సివుంది. దీనికి గాను ఇప్పటికే 250 స్కూళ్లలో ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యకు అవకాశం కల్పిస్తామంటూ విద్యా శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

ఉచిత విద్యకు నిబంధనలు ఇలా..

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కల్పించే ఉచిత విద్యను పొందడానికి ప్రభుత్వం కొన్ని నిబంధనలు ఏర్పాటుచేసింది. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్-12(1)(సి)ని అనుసరించి 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను ఆడపిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశం లభించాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.14 లక్షలుగా నిర్ణయించారు. ప్రవేశం కల్పించే స్కూళ్ల యాజమాన్యాలకు అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఒక్కో అడ్మిషన్‌కు రూ.5 వేలు, రూరల్ పరిధిలో రూ.6,500 ఫీజును ప్రభుత్వం నిర్ణయించగా ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం ఏటా రూ.15 వేలు తల్లుల బ్యాంకు ఖాతాలో జమచేస్తుండగా ప్రైవేటు స్కూళ్లకు ఎంపికై న విద్యార్థులకు అమ్మఒడి డబ్బుల్లోనే ఫీజు చెల్లించి మిగిలిన మొత్తాన్ని విద్యార్థి తల్లి, సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులకు అవకాశం

ప్రైవేటు పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు మార్చి 18 నుంచే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించగా ఈ నెల 10 వరకు గడువుంది. ఏప్రిల్ 12న విద్యార్థుల అర్హత నిర్ధారణ, 13న లాటరీ ద్వారా మొదటి విడత ఎంపిక, 25న రెండో విడత లాటరీ ద్వారా ఎంపిక చేపడతారు. విద్యార్థులు నివసించే ప్రాంతంలో కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలలకు సీట్లు కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరికకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో 30 మందికిపైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నెల 10 వరకు గడువు ఉన్నందున ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసించాలనే ఆసక్తనున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

గుంటూరు వెళ్లి పింఛను అందజేత



గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావుకు పింఛను అందజేస్తున్న దొడ్డనపూడి వలంటీర్ పెద్దిరాజు

కాళ్ల: కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామ పంచాయతీ సచివాలయం-2 కు చెందిన వలంటీర్ పల్లికొండ పెద్దిరాజు గుంటూరు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశాడు. అతని క్లస్టర్‌లో నివసిస్తున్న కొల్లి వెంకటేశ్వరరావుకు బ్రెయిన్ ఆపరేషన్ చేశారు. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మరో 20 రోజులు హాస్పిటల్లో ఉండాలని వైద్యులు చెప్పడంతో వలంటీర్ పెద్దిరాజు తన సొంత ఖర్చుతో గుంటూరు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశాడు. దీనితో లబ్ధిదారుడు వెంకటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశాడు. గ్రామస్తులు పెద్దిరాజును అభినందించారు.

న్యూస్‌రీల్

ముగిసిన అర్చక శిక్షణా తరగతులు



ఆగమ విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అర్చక అకాడమీ డైరెక్టర్ రాజగోపాల చక్రవర్తి

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆగమ పాఠశాలలో జరుగుతున్న అర్చక శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. దేవదాయ శాఖ, అర్చక ట్రైనింగ్ అకాడమీ, చినవెంకన్న దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు జరిగాయి. ముగింపు రోజు విద్యార్థులకు అర్చక అకాడమీ డైరెక్టర్ రాజగోపాల చక్రవర్తి మార్గనిర్దేశం చేశారు. శిక్షణా తరగతుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం తరగతుల్లో పాల్గొన్న అర్చకులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అర్చక అకాడమీ చీఫ్ కోఆర్డినేటర్ మంగరాజ చక్రవర్తి, ఆలయ ఏఈఓ నటరాజారావు, సూపరింటెండెంట్ గిరిజారాణి, ఆగమ పాఠశాల ప్రిన్సిపాల్ డి.వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో కొత్తగా 11 బస్సులు అద్దె ప్రాతిపదికన ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ టెండర్లను ఆహ్వానిస్తుందని జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి ఎ.వీరయ్య చౌదరి తెలిపారు. ఆసక్తిగల బిడ్డర్లు ఆర్టీసీ ఇ-కామర్స్ పోర్టల్‌లో నమోదు చేసుకుని టెండరు దరఖాస్తులు పొందాలన్నారు. బిడ్‌లను ఏప్రిల్ 5 ఉదయం 10 నుంచి ఏప్రిల్ 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దాఖలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియను మే 3 ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. అద్దె బస్సులు ప్రవేశపెట్టే రూట్లు, బస్సుల ప్రమాణాలు, ఇతర వివరాలు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

నేత్రపర్వం చాత్మార్ ఉత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారికి చాత్మర్ ఉత్సవం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. చాత్మార్ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారి వాహనం ఆలయ ప్రధానరాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది.

గోదావరికి పంచ హారతులు

పెనుగొండ : చైత్ర పౌర్ణమి పురస్కరించుకొని సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద గోదావరికి హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు ఇచ్చారు. బుధవారం రాత్రి వేద పండితుల సమక్షంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా..

ఏలూరు టౌన్: తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకోవాలని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి కోరారు. ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 9 మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న బాలలను ఆయన పరామర్శించి వైద్య చికిత్స అందుతున్న తీరును ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు



కలెక్టరేట్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ మురళీ తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): మహనీయులు సాధించిన విజయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన హక్కుల సాధన, సమ సమాజ స్థాపన ఇలాంటి మహనీయుల కృషి ఫలితమే అన్నారు. వారు సాధించిన విజయాలు మనకు, భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ప్రస్తుతం అన్ని వసతులు ఉంటేనే విజయ అవకాశాలు అంతంత మాత్రమేనని, బాబు జగజ్జీవన్ రామ్ చాలా చిన్న గ్రామంలో జన్మించి వివక్ష, అసమానతలతో పోరాడి దేశ ఉప ప్రధాని స్థాయికి చేరుకున్నారన్నారు. జగ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా ఉన్న కాలంలో అనేక సంస్కరణలు, చట్టాలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. జాయింట్ కలెక్టర్ జేవీ మురళీ మాట్లాడుతూ ధైర్యంగా ముందుకు వచ్చి పోరాడటం కొందరికే సాధ్యమని వారిలో జగ్జీవన్ రామ్ ఒకరన్నారు. 40 సంవత్సరాల కాలంలో కార్మిక, వ్యవసాయ, రైల్వే, రక్షణ శాఖల మంత్రిగా పనిచేయడంతో పాటు, భారత ఉప ప్రధానిగా కూడా పని చేశారన్నారు. 1971లో రక్షణ మంత్రిగా ఉన్న కాలంలో పాకిస్తాన్‌పై యుద్ధంలో భారత్ విజయం సాధించిందన్నారు. తొలుత బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ పి.ప్రశాంతి, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. జయంత్యుత్సవాల్లో రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఎంబీసి చైర్మన్ పెండ్ర వీరన్న, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జేఏసీ రాష్ట్ర ప్రెసిడెంటు కె.జోసెఫ్, మాల మహానాడు నాయకుడు చీకటిమిల్లి మంగరాజు, జేఏసీ వైస్ ప్రెసిడెంటు బి.రమేష్ బాబు, కన్వీనరు టి.మధు, నిర్వాహక కార్యదర్శి బి.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

సాక్షి, భీమవరం: బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం భీమవరం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి మోషేనురాజు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దళితుల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువరానిదని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు బలే ఏసుబాబు, బొకూరి విజయరాజు, పాలపర్తి జోనా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి

- డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా చేయూత
- హోంమంత్రి తానేటి వనిత వెల్లడి



అత్తిలి మండలం కె.సముద్రపుగట్టులో రైతులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న మంత్రులు తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన నాటికి మహిళలకు ఎంత రుణం ఉన్నా దానిని నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని మాట ఇచ్చి ఇప్పటికే మూడు విడతలు రుణమాఫీ చేశారని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. బుధవారం అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ కార్యక్రమంలో హోంమంత్రి తానేటి వనిత, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అనంతరం స్కిన్నెరపురంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను మంత్రులు తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ 45 ఏళ్లు దాటిన మహిళలకు చేయూత పథకం ద్వారా సంవత్సరానికి రూ.18,500 అందించి వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారని ఆమె తెలిపారు. కాపు మహిళలు, అగ్ర వర్ణ పేదలకు ఏడాదికి రూ.15 వేలు అందించి ఆర్థికంగా బలోపేతం అవ్వడానికి అవకాశం కల్పించారని తెలిపారు.

24 గంటలూ వైద్య సేవలు

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించడంతో పాటు వైద్యులు కూడా అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు గ్రామంలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసిరాజు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ అడ్డాల జానకి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్‌లు బండి వెంకటలక్ష్మి, అడ్డాల భానులలిత మహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరావు, దారం శిరీష, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనప రెడ్డి జయరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యు లు అద్దంకి శ్రీను, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకటాల సతీష్, తమ్మాబత్తుల సత్యనారాయణ, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లతో ఆర్థిక చేయూత

నరసాపురంలో మార్ట్ ప్రారంభించిన చీఫ్ విప్ ముదునూరి



జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పలుచోట్ల జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఇవి డ్వాక్రా మహిళలు నడుపుకునే సూపర్‌మార్కెట్లు అని పేర్కొన్నారు. బుధవారం నరసాపురం మొగల్తూరు రోడ్డులోని 216 జాతీయరహదారి పక్కన డ్వాక్రా బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆసరా మహిళా మార్ట్‌ను పీఆర్ అండ్ ఆర్డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలో మొట్టమొదటిసారిగా నరసాపురంలో ఏర్పాటు చేశారన్నారు.

కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం

మార్ట్ నిర్వహణకు, సరుకు సరఫరాకు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నామని పీఆర్ అండ్ ఆర్డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ వివరించారు. వెలుగు, మెప్మా సంస్థలు సహకరిస్తున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న మార్ట్‌లకు దీటుగా మహిళా మార్ట్‌లు పనిచేస్తాయని, నాణ్యమైన సరుకులు అందిస్తాయని చెప్పారు. మార్ట్ నిర్వహణ కోసం సమాఖ్యలోని 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు అవుతుందని చెప్పారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పడి ఏడాది అవుతుండగా తీరప్రాంతంలో మహిళలతో ఇలాంటి మార్ట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో తణుకులో కూడా ప్రారంభిస్తామని చెప్పారు. సెర్ప్ సీఈవో ఇంతియాజ్, సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డ్వామా పీడీ రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మహిళా బాంధవుడు సీఎం జగన్

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు



వడలిలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రతీ పథక లబ్ధి మహిళలకే అందేలా సంక్షేమాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా బాంధవుడిగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ రంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండ మండలంలో సిద్ధాంతం, నడిపూడి, వడలి గ్రామాల్లో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సమావేశాల్లో పాల్గొని 1,284 గ్రూపులకు రూ.14,00,91,702 చెక్కును పంపిణీ చేశారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నారంటూ చంద్రబాబు, మాజీ మంత్రి పితాని మూడేళ్ల పాటు విమర్శలు చేస్తూ వచ్చారని, నేడు స్వరం మార్చి సీఎం జగన్ సంక్షేమ పథకాలు కొనసాగిస్తామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ మహిళలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కక్ష పూరిత పాలన చేస్తున్నారని పితాని విమర్శిస్తున్నారని, ఆచంట నియోజకవర్గంలో ఎవరిమీద అక్రమ కేసులు పెట్టారో చెప్పాలన్నారు. ఈఎస్ఐ స్కాంలో ఆరు నెలలు పాటు అక్కడా, ఇక్కడా తలదాచుకొన్నా ఏనాడు వారిని అరెస్ట్ చేయమని ఒత్తిడి తీసుకు రాలేదన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మించడం, రహదారులు నిర్మించడం, విద్యార్థులను ఆదుకోవడం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. సీఎం జగన్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్‌లు వెలగల వెంకట రమణ, చిల్లే లావణ్య, ఎంపీపీలు పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), కేవీ నారాయణ రెడ్డి(వాసు), జడ్పీటీసీలు పోడూరి గోవర్ధన, కర్రి గౌరీ సుభాషిణి, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు దండు పద్మావతి, సుంకర సీతారామ్, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, ఎంపీటీసీలు కర్రి అనురాధ, చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, పడమట్ల పద్మనాగేశ్వరి, చిటికెన లక్ష్మీదుర్గ, రెడ్డి గణేశ్వరరావు, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), యర్రంశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ఇందిర మృతదేహం

పెనుగొండ: చినమల్లంలో బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రుకు చెందిన తాళ్లపల్లి ఇందిర.. కొడుకు సాయి మణికంఠతో కలిసి బుధవారం యలమంచిలి మండలం గుంపర్రు వెళుతోంది. చినమల్లం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఇందిరకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా, వాహనం చేరేసరికి ఆమె మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన మరో మోటార్ సైకిల్ ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు దాని కోసం గాలిస్తున్నారు. మృతురాలి కుమారుడు సాయి మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ చెప్పారు.

వీఆర్‌పురం ఎస్సైకు తీవ్ర గాయాలు

వేలేరుపాడు: విధులకు వెళుతూ బైక్ అదుపుతప్పడంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా వీఆర్‌పురం ఎస్సై తెల్లం దుర్గాప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. స్వగ్రామమైన ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి వేలేరుపాడు మండలం రుద్రమకోట గోదావరి రేవుకు ఎస్సై దుర్గాప్రసాద్ బుధవారం బైక్‌పై బయలుదేరారు. లచ్చిగూడెం కల్వర్టు వద్ద గొయ్యిలో పడి బైక్ అదుపుతప్పి కిందపడగా, ఎస్సై కాలు, చేతులకు తీవ్రగాయ్యాయి. స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రూ.2 వేలు అప్పు ఇవ్వనన్నాడని..

- నిద్రపోతున్న స్నేహితుడిని రాడ్డుతో కొట్టి చంపేశాడు
- అతడి భార్య, కొడుకుపైనా దాడి.. పుస్తెలు, చెవిదిద్దుల అపహరణ
- నాలుగు రోజుల్లోనే కేసు ఛేదించిన జంగారెడ్డిగూడెం పోలీసులు
- ఏలూరులో వివరాలు వెల్లడించిన ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



ఏలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

ఏలూరు టౌన్: తాకట్టులో ఉన్న మోటార్ సైకిల్ విడిపించుకునేందుకు కేవలం రూ.రెండు వేలు ఇవ్వలేదనే కక్షతో నిద్రపోతున్న స్నేహితుడి ఇనుపరాడ్‌తో కొట్టి హత్య చేసిన ఘటనలో నిందితుడిని నాలుగు రోజుల్లోనే జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. కేసు వివరాలను ఏలూరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ వెల్లడించారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోణం శివ పామాయిల్ గెలలు నరికే పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వేగవరం గ్రామానికి చెందిన తాపీ పని చేసుకునే కొప్పర్తి రామకృష్ణ అలియాస్ బకీర్ పరిచయమయ్యాడు. ఇద్దరూ అప్పుడప్పుడు కలిసి మద్యం సేవిస్తుంటారు. రామకృష్ణ శివ ఇంటికి వెళుతుంటాడు. ఇదిలా ఉండగా, రామకృష్ణ వేరొక స్నేహితుడు బాలాజీకి చెందిన మోటారు సైకిల్‌ను తన అవసరం నిమిత్తం రూ.11 వేలకు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోమని రామకృష్ణకు చెప్పగా, తన అవసరాలు నిమిత్తం అదనంగా రూ.2 వేలు తీసుకుని వాడుకున్నాడు. ఈ నెల 1వ తేదీన బాలాజీ తన మోటారు సైకిల్‌ను తాకట్టు నుంచి విడిపించాలని రూ.12 వేలు రామకృష్ణకు ఇచ్చాడు. కానీ నిందితుడు రామకృష్ణ తాను వాడుకున్న రూ.2 వేలు సమకూరకపోవడంతో అదేరోజు రాత్రి 9.30 గంటలకు మైసన్నగూడెంలోని తోణం శివ వద్దకు వెళ్లి తనకు రూ.2 వేలు ఇవ్వాలని అతనిని కోరగా నిరాకరించాడు. అయితే ఇద్దరూ పొగాకు బ్యారన్ వద్ద ఉండగా శివకు బాకీ ఉన్న ఇద్దరు రైతులు రూ.15 వేలు నగదును ఇచ్చారు. శివ వద్ద డబ్బు ఉందని గ్రహించిన రామకృష్ణ అతనితో మద్యం తాగుతూ ఉండిపోయాడు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో శివ బ్యారన్ వద్ద చెక్కబడ్డీపై పడుకుని ఉండగా, ఇదే అదునుగా భావించిన రామకృష్ణ ఇనుప రాడ్డుతో శివను కొట్టి అతని సెల్‌ఫోన్ రూ.15 వేలు నగదు అపహరించాడు. సాక్ష్యం చెబుతుందనే అనుమానంతో శివ ఇంటికి వెళ్లి నిద్రిస్తున్న అతని భార్య తోణం చిన్నిని రాడ్డు కొట్టి మెడలో బంగారు పుస్తెల తాడు, చెవిదిద్దులు బలవంతంగా లాక్కుని వెళుతూ కుమారుడిని సైతం రాడ్డుతో కొట్టి పారిపోయాడు. తీవ్ర గాయాలతో ఉన్న వీరిని చికిత్స నిమిత్తం గుంటూరు తరలించగా, శివ అదేరోజు మృతి చెందాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన జంగారెడ్డిగూడెం పోలీసులు నిందితుడు రామకృష్ణను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.14వేల నగదు, సెల్‌ఫోన్, మూడు కాసుల బంగారు తాడు, అరకాసు చెవిదిద్దులు, ఇనుపరాడ్డు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేధించడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పీ.బాలసురేష్‌బాబు, ఎస్సై సాగర్‌బాబు ఉన్నారు.

'పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ ప్రారంభం


భీమవరంలో పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ ప్రారంభిస్తున్న ఎస్పీ రవిప్రకాష్ సతీమణి కోమలిదేవి

సాక్షి, భీమవరం: భీమవరంలో పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్‌ను జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సతీమణి కోమలిదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసులందరికీ తక్షణ వైద్యం అందించడానికి పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంరక్షణ దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రి ప్రారంభించినట్లు చెప్పారు. ఈ హాస్పిటల్‌లో నాలుగు పడకలు, ప్రభుత్వ వైద్యునితోపాటు ఇతర పారా మెడికల్ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. రోగులకు అవసరమైన మందులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పోలీసు సిబ్బంది కోసం సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎవీ సుబ్బరాజు, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐ వెంకట్రావు, ఆర్ఐ అడ్మిన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ నాటిక పోటీలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు కళా పరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ బుధవారం చెప్పారు. పాలకొల్లు పట్టణ మెయిన్‌రోడ్డులో ఉన్న అద్దేపల్లివారి సత్రం ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ప్రదర్శించే ప్రతి నాటికకు రూ.15 వేలు పారితోషకం ఇస్తామన్నారు. అలాగే ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు వ్యక్తిగత బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీలకు ఏడు నాటికలను ప్రదర్శనకు ఎంపిక చేశామని, 7న శర్వాణి గిరిజన సాంస్కృతిక కేంద్రం - బొరివంక (శ్రీకాకుళం జిల్లా) వారి కొత్త పరిమళం, అమృత లహరి గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా, 8న ఉషోదయ కళా నికేతన్, కత్రిపాడు వారి ప్రక్షాళన, సాయి రాఘవేంద్ర మూవీ మేకర్స్ - గుంటూరు వారి కెరటాలు, మద్దుకూరి క్రియేషన్స్, చిలకలూరిపేట వారి మృత్యుపత్రం, 9న అరవిందా ఆర్ట్స్ తాడేపల్లి వారి వెండి అంచులు, అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి అతీతం నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళా పరిషత్ సభ్యులు మానాపురం సత్యనారాయణ, మేడికొండ శ్రీనివాస చౌదరి, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, కేఎస్‌పీఎన్ వర్మ, విటాకుల రమణ, కొల్లి కొండ ప్రసాద్, దాసరి నాని, నడపన శ్రీనివాస్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, షేక్ పీర్‌సాహెబ్, రెడ్డి వాసు, జీఎస్ఎన్ రవి తదితరులు పోటీల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

- భార్యను రోకలిబండతో కొట్టి చంపేశాడు
- గర్భిణి సోడే రాధ హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ, నిందితుడు వెంకటేశ్వరరావు (ముసుగు వ్యక్తి)

వేలేరుపాడు: పాతరెడ్డిగూడెంలో నాలుగు నెలల గర్భిణి సోడే రాధ హత్య కేసులో భర్తను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. తన వివాహేతర సంబంధానికి భార్య అడ్డుగా ఉందని భావించి ఈ హత్య చేసినట్లు భర్త, నిందితుడు సోడే వెంకటేశ్వరావు పోలీసుల ఎదుట అంగీకరించాడు. వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుక్కునూరు సీఐ సత్యనారాయణ కేసు వివరాలను వెల్లడించారు. పాతరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సోడే రాధను పదేళ్ల క్రితం వెంకటేశ్వర్లు వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. మద్యం అలవాటు ఉన్న వెంకటేశ్వర్లు గతంలో తన తండ్రి పైనే దాడి చేసి చెయ్యి విరగొట్టాడు. ఇదిలా ఉండగా, కుక్కునూరు మండలం గుడంబోరులో ఒక గిరిజన యువతితో వెంకటేశ్వర్లు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గత నెల 31వ తేదీ రాత్రి పదిగంటలకు ఇదే విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భార్యను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భర్త వెంకటేశ్వరావు అనుకుని ఆమె తలపై రోకలిబండతో బలంగా రెండు సార్లు కొట్టి పరారయ్యాడు. స్థానికులకు విషయం తెలిసి రక్తపుమడుగులో ఉన్న ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల ఒకటో తేదీ ఉదయం రాధ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుడు వెంకటేశ్వర్లును వసంతవాడ వంతెన వద్ద బుధవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. గురువారం కోర్టులో హాజరుపరచనున్నారు. విలేకరుల సమావేశంలో వేలేరుపాడు ఎస్సై శ్రీనివాసరావు, హెచ్‌సీలు డానియోల్, రాజేష్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

మినీ ట్రక్కును ఢీకొన్న లారీ

- మహిళా కూలీ మృతి, మరో నలుగురికి గాయాలు
- చేపల పట్టుబడికి వెళుతుండగా కోరుకొల్లు శివారులో ప్రమాదం


ఘటనా స్థలంలో లక్ష్మీ మృతదేహం


పొలాల్లోకి దూసుకువెళ్లిన మినీ ట్రక్కు


లక్ష్మీ (ఫైల్)


అక్కాచెల్లెళ్లు యామినీ, అంజలి

కైకలూరు: చేపల పట్టుబడి కోసం కూలీలతో వెళుతున్న మినీ ట్రక్కును లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళా కూలీ అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో చేపల చెరువులో పట్టుబడి పనుల కోసం కలిదిండి మండలం కొండంగిలో ఐదుగురు కూలీలను ఎక్కించుకుని వ్యాన్ బుధవారం బయలుదేరింది. దేవునితోటకు చెందిన రమణబోయిన లక్ష్మి (32) కలిదిండిలో ఇదే వాహనం ఎక్కింది. కోరుకొల్లు దాటి జగనన్న కాలనీ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గ్రోవెల్ కంపెనీకి చెందిన లారీ ఢీకొట్టడంతో వ్యాన్ సమీపంలోని పొలాల్లోకి దూసుకువెళ్లగా, వాహనం నుంచి ఎగిరి రోడ్డుపై పడిన లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు వ్యక్తులకు గాయలయ్యాయి. మృతురాలు లక్ష్మి తండ్రి కోకా మోహనరావు ఫిర్యాదుపై కలిదిండి ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనాథలైన కుమార్తెలు

తల్లి లక్ష్మి మృతితో ఆమె కుమార్తెలు పదకొండేళ్ల అంజలీదేవి, తొమ్మిదేళ్ల యామినితేజా అనాథలయ్యారు. తల్లి మృతి వార్త తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకుని 'అమ్మా లేమ్మా.. చెల్లికి ఆకలేస్తోందటా.. అన్నం పెడుదువుగానీ.. నాపై కోపమా.. ఇంకెప్పుడూ అల్లరి చేయనమ్మా.. బడికి మానకుండా వెళతానమ్మా.. లేమ్మా' అంటూ అక్కాచెల్లెళ్లు తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. లక్ష్మికి విజయవాడకు చెందిన శ్రీనివాసరావుతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అంజలి ఐదో తరగతి, యామిని నాలుగో తరగతి చదువుతున్నారు. తండ్రి శ్రీనివాసరావు పెయింటర్‌గా కలిదిండిలో పనిచేసేవాడు. మూడేళ్ల క్రితం కామెర్ల వ్యాధితో తండ్రి మృతి చెందగా, అప్పటి నుంచి తల్లి లక్ష్మి ఎవరి సాయం ఆశించకుండా కూలీ పనులకు వెళుతూ పిల్లలను సాకుతోంది.

ఈదరలో వ్యక్తి దారుణ హత్య


సంఘటనా స్థలంలో కోటయ్య మృతదేహం


కోటయ్య (ఫైల్)

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర గ్రామంలోని ఓ మామిడితోటలో బుధవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొద్దనపల్లికి చెందిన గోళ్ల కొటేశ్వరరావు అలియాస్ కోటయ్య (32) ఈదర గ్రామంలోని మామిడి తోటల్లో కోళ్లను పెంచుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బోడపాటి నాగమణితో వివాహేతర సంబంధం కారణంగా కోటయ్య భార్య తిరపతమ్మ ఆరు నెలల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి నాగమణి వద్ద ఉంటూ ఆమెతో కోటయ్య సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో నాగమణి రెండో భర్త గోపీ కారణంగా కోటయ్య, నాగమణి మధ్య గొడవలు జరగడం మొదలయ్యాయి. దీంతో నాగమణి, తన రెండో భర్త గోపీతో కలిసి కోటయ్యను ఎలాగైనా అంత మొందించాలనుకుంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున మామిడి తోటలో నిద్రిస్తున్న కోటయ్యను కత్తితో విచక్షణారహితంగా నాగమణి, గోపీ కలిసి దాడి చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కోటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేయగా, నూజివీడు రూరల్ సీఐ అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో

- వ్యవసాయంలో సమర్థవంతంగా చీడపీడల నివారణ
- కీటకాల గుడ్లు, శిలీంద్రాలు, కలుపు సమస్యలూ దూరం
- నేల సారవంతం, నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు దోహదం


మెట్ట ప్రాంతంలో వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతు

చింతలపూడి: జిల్లాలోని మెట్ట ప్రాంతం వ్యవసాయ భూముల్లో స్థూల, సూక్ష్మపోషక పదార్థాలు తగ్గిపోతుండటంపై వ్యవసాయ నిపుణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద ఎక్కువగా ఉండటం వల్ల పశువుల ఎరువు పుష్కలంగా లభించేది. దీనిని రైతులు సేంద్రియ ఎరువుగా పంటలకు వాడేవారు. క్రమేపీ వ్యవసాయ రంగంలో యంత్ర పనిముట్ల వినియోగం పెరగడంతో రైతులు పశువుల పెంపకాన్ని తగ్గించారు. దీంతో సేంద్రియ ఎరువుకు కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడమే కాక పైరుకు అవసరమైన పోషక పదార్థాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీనివల్ల దిగుబడులు తగ్గి, చీడపీడల ఉధృతి పెరగడం వంటి పరిస్థితులు తలెత్తాయి. రైతులు సరైన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ఏటా 17,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంటను రైతులు సాగు చేస్తారు. పంటకాలం పూర్తయ్యాక తొలకరి వర్షాలు కురిసే వరకు భూమిని పట్టించుకోరు. సాధారణంగా రైతులు కోతలు పూర్తవగానే పొలాలను అలాగే వదిలేస్తారు. మళ్లీ తొలకరి పలకరించగానే సాగుకు సిద్ధమవుతారు. చినుకులు పడగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలోనే దుక్కులు దున్నడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరుగుతాయి. అవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి పెరుగుతాయి. కారణంగా భూమి లోపలి పొరల్లో నీరు హరించిపోయి భూసారం తగ్గిపోతుంది. రైతు వేసిన పంటకు పోషకాలు లభించవు. వేసవి దుక్కుల వల్ల భూమి లోపలి పొరల్లో దాగి ఉన్న కీటకాల గుడ్లు, శిలీంద్రాలు బయటకు వచ్చి ఎండ తీవ్రతకు నశిస్తాయి. దుక్కిలో బయటపడిన పురుగులను పక్షులు తినడం వల్ల పంటలకు చీడపీడల బెడద తప్పుతుంది.

భూసారం పెంపు ఇలా

భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట సాగు చేయాలి. దీనివల్ల భూసారం పెరగడమేకాక చీడపీడల బెడద తప్పి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో నివసించే జీవరాశులకు ఆహారంగా, మొక్కలకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా ఈ పచ్చిరొట్ట పంటలు ఉపయోగ పడతాయి.

నేల సారవంతం మెరుగుపడుతుంది



భూమిని 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కులు దున్నడం వల్ల నేలలో గాలి లభ్యత పెరిగి సూక్ష్మ జీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థాల లభ్యత పెరిగి నేల సారవంతమవుతుంది. భూమికి వాలుగా దుక్కి దున్నడంతో వర్షం కురిసినప్పుడు ఆనీరు భూమి లోపలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజని వర్షపు నీటితో కలిసి నేలకు చేరడంతో సారవంతంగా మారుతుంది. – బి.నాగకుమార్, ఏడీఏ

విద్యుదాఘాతానికి గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

ఏలూరు రూరల్: విద్యుదాఘాతానికి గురై మూడు గేదెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే. పోణంగిలో ఓ రైతుకు చెందిన మూడు గేదెలు శ్రీపర్రు సరిహద్దులో చేపలు, పంటపొలాల గట్లపై పచ్చిక మేస్తున్నాయి. సాయంత్రం వేళ చెరువు గట్టు పరిసరాల్లో వెళుతూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాయి. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. మొదట్లో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుగా ఏర్పాటు చేశామని, అయితే చెరువు యజమాని గట్టుపై మట్టి పోయడంతో ఎత్తు తగ్గిందన్నారు. దీనిపై చెరువు యజమానినే రైతుకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఉందన్నారు.

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కె.ఎన్.రోడ్డులో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ బాలస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాత పేరూరి కాశయ్య, క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ వంగపండు రామ్మోహన్‌రావు, కోశాధికారి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు, అనిల్, త్రిమూర్తులు, యర్రా ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



జీవిత భీమా సంస్థ కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని జీవిత బీమా సంస్థ యూనియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, కార్యదర్శి సోలస సత్యనారాయణలు మాట్లాడుతూ కొత్త పెన్షన్ స్కీం వెంటనే రద్దు చేసి, కార్మికులకు కనీస జీతం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.అశోక్‌కుమార్, మహంకాళి, శాంతి, స్వప్న, సుధ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన శివకుమార్



తణుకులో మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివకుమార్

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కావాడి శివకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందచేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు జగనన్న పదవులను కట్టబెడుతున్నారని ఆయనకు రుణపడి ఉంటామని శివకుమార్ అన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్ ఆవిష్కరణ



మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్నే మా భవిష్యత్తు పోస్టరును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీపీలు దాసరి హైమావతి, పొనుకుమాటి శేషులత, బోణం విజయనిర్మల, వైఎస్సార్‌సిపి సేవాదళ్ పట్టణ అధ్యక్షులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి పెంటపాడులో క్రికెట్ టోర్నమెంట్

పెంటపాడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఈనెల 8 నుంచి పెంటపాడు ఎస్టీవీఎస్ హిందూ హైస్కూల్లో మెగా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పెంటపాడు జైభీమ్ యూత్ అసోషియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేవారికి ఎంట్రీలు పంపేందుకు ఈనెల 7న చివరి తేదీగా ప్రకటించారు. మొదటిబహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ. 10 వేలుగా నిర్ణయించారు. పోటీలో పాల్గొనేవారు రూ. 1000 ఎంట్రీఫీజు చెల్లించి పోటీలలో పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు, 774891343, 97011,78638 సంప్రదించాలన్నారు.

దళిత బాంధవుడు జగ్జీవన్‌రామ్

తణుకు టౌన్: దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చూపిన బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా తణుకు పాతూరులోని ఎన్టీయార్ పార్కు వద్ద అరుంధతీయ యువజన సంఘం, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు సుద్దుల పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మదర్ థెరిస్సా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ భారత దేశంలో బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందించి అమలు చేసిన నాయకుడు జగ్జీవన్‌రామ్ అని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షుడు గుబ్బల సూర్యచంద్రరావు, తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యకుడు పొట్ల సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, స్థానిక నాయకులు ఉండ్రాజవరపు గీత, రాజశేఖర్, శకుంతల, తలపాకుల రాము, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ యువత ర్యాలీ...

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా తణుకు, వీరభద్రపురం గ్రామాలకు చెందిన మాదిగ, అరుంధతీయ యువత ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు అరుంధతీయ నాయకులు సుద్దుల పాండు, అబ్బదాసరి లాజర్, ఉండ్రాజవరపు రాజ్‌కుమార్, గీత, ఉందుర్తి ప్రసన్న, కారుమంచి యోహాన్, తానేటి ప్రసాద్, తలపాకుల రాము, ఉండ్రాజవరపు గనిరాజు పాల్గొన్నారు.

తణుకు మండలంలో...

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. బుధవారం తణుకు రూరల్ మండలం వీరభద్రపురంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు దూలపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకులు సీహెచ్ ప్రసాద్, మాజీ గ్రామ సర్పంచ్ ఎం ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ టీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వై పీటర్, ఎమ్మార్పీయస్ నాయకులు ఎం సుధాకర్‌బాబులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని దువ్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీ సభ్యులు పీ అశోక్, ఇతర నాయకులు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, ఇతర నాయకులు, కోనాల గ్రామంలో గ్రామ సర్పంచ్ చిన్నయ్య, వైఎస్సార్సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాడేపల్లిగూడెం రూరల్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని పుల్లాయగూడెం ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధునిగా, స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు, జిల్లా దళిత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కండెల్లి వెంకట్, గ్రామ దళిత నాయకులు కండెల్లి నాగేశ్వరరావు, గెద్దం పెద మరియ, మొసలి నాని, బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం సాధించడమే బాబూ జగ్జీవన్‌రామ్‌కు నిజమైన నివాళి అని ఎంపీపీ పొనుకుమాటి శేషులత అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, ఎమ్పీటీసీ నార్ని నాగేశ్వరరావు (నాగులు), జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, నాయకులు అడ్డాల గోపీకృష్ణ, సొసైటీ డైరెక్టర్ చిట్టూరి బాపన్న పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి దాసం సునీల్ కుమార్, ముత్తా రామారావు, కునిరెడ్డి శ్రీనివాస్, చక్కా ఇజ్రాయిల్ రాజు, అద్దంకి విజయ్‌కుమార్, ఎల్.రాజు, సభ్యులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, ఉపాధ్యక్షుడు బండారు బెనర్జీ బాబు, పట్టణ అధ్యక్షుడు కేశంభట్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ మహోన్నత వ్యక్తి అని ఉద్యానవర్సిటీలో బుధవారం జరి గిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు. సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, అలుపెరుగని పోరాటం చేసిన రాజకీయ సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రాం అన్నారు. జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు ఎస్.సూర్యకుమారి, డి.వెంకటస్వామి, ఎం.చిరంజీవులు, వి.ఆనందబాబు, వీసీఆర్ శ్రీనివాసు, ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాబు జగజ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

తణుకు అర్బన్: భారత ఉప ప్రధాని దివంగత బాబు జగజ్జీవన్‌రామ్ జయంతిని తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.



తణుకులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



పెంటపాడు మండలంలోని కునాకరపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తాడేపల్లిగూడెం మండలం పుల్లాయగూడెం గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



బార్ అసోసియేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

జగ్జీవన్ సేవలు మరువలేనివి

పెంటపాడు: జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. మండలంలోని కె. పెంటపాడు, బిళ్లగుంట, వల్లూరుపల్లి గ్రామాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మట్లాడుతూ దేశానికి ఉపప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కిలాడి రామయ్య, యండం శ్రీను, యజ్జల రామారావు, యూత్ సభ్యులు శేఖర్, సురేష్, చినబాబు తదితరులు పాల్గొన్నారు. వల్లూరుపల్లి , కె. పెంటపాడులో జరిగిన కార్యక్రమాల్లో వసంతాడ జోగేంద్రనాథ్, ఎం. సంతోషరావు, సిరా శ్రీను, బాదంపూడి సురేష్, ఉండ్రాజవరపు ప్రభాకర్, గ్రామ పెద్దలు, జగజ్జీవన్ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. కునాకర పేటలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ సభ్యులు తెన్నేటి సంజయ్‌ఖాన్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఉన్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారన్నారు. పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవాబత్తుల బాబి, వైఎస్సార్ పార్టీ కార్యదర్శి చదలవాడ శ్రీనివాస్, ఉండ్రాజవరపు గోపి, వార్డు మెంబర్లు మారంపూడి ఏసుదాసు, బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీనివాస్, తానేటి కుమార్‌రాజా, కర్రి వరహాలరెడ్డి, తానేటి పద్మారావు, కళింగ పెదలక్ష్మణరావు, కునాకరపేట జగ్జీవన్‌రామ్ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు, అలంపురం, ముదునూరు, ఆకుతీగపాడు, రామచంద్రపురం తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి

- మంత్రులు తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు
- మహిళ సాధికారత కోసం సీఎం జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత, చిత్రంలో మంత్రి కారుమూరి

ఇరగవరం: డా.బి.ఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల ఆలోచనకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగుతుందని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా బాబు జగ్జీవన్‌రామ్, డా.అంబేద్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఇందిర గాంధీ , విగ్రహలను ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.92 లక్షలతో నిర్మించిన అరుంధతి పేట యువజన సంఘ స్థలం ప్రహరీ గోడను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 45 సంవత్సరాలు దాటిన మహిళలకు చేయూత పథకం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనర్టీ మహిళలకు ప్రతి సంవత్సరం రూ.18,500 ఇచ్చి వారు సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. మనం స్వేచ్ఛగా జీవించే హక్కును అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించారని తెలిపారు. ఒక దళిత మహిళకు రాష్ట్ర హోం మంత్రిగా అవకాశం కల్పించడం సీఎం జగన్‌కు మహిళల మీద ఉన్న నమ్మకం అని ఆమె అన్నారు. రాష్ట్రంలో మహిళలకు నామినేటేడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర పౌరసరాఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతు బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నేడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం మంత్రులను స్థానిక నాయకులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, వైస్సార్ సీపీ గ్రామా అధ్యక్షుడు పులుపు అనిల్, తాతపూడి బోస్, దిరిసిపో రాజు, చదలవాడ నాని, కనకయ్య, చినరాజు చేబ్రోలు పెద్దిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, డీసీఎఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు,మహిళ అధ్యక్షురాలు కిరాణ్మయి స్థానిక నాయకులు, అభిమానులు దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి అర ఎకరం భూమి వితరణ



దాత సూర్యనారాయణరెడ్డిని అభినందిస్తున్న పెంటపాడు రెడ్డి సంఘ నాయకులు

పెంటపాడు: పెంటపాడులో ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాల సమీపంలోని రామాలయానికి ఆ గ్రామానికి చెందిన గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి, ఉదయభాను దంపతులు అర ఎకరం వ్యవసాయ భూమిని విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణకు ఈ విషయం తెలియజేయడంతో సూర్యనారాయణరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, యూత్ అధ్యక్షులు కొవ్వూరి బాస్కరరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, వాణిజ్యవేత్తలు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, గాంధీరెడ్డి, బుజ్జి, సుధా శ్రీనివాసరెడ్డి, చినగోపిరెడ్డి, కర్రి పృధ్వీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా మండపాక యల్లారమ్మ గరగోత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న చక్ర రాజ సహిత యల్లారమ్మ అమ్మవారి వసంతోత్సవం, జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గ్రామంలోని గరగోత్సవం నిర్వహించారు. ఈ జాతర మహోత్సవాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన బుట్టబొమ్మలు, కేరళ డప్పులు, తీన్‌మార్ బృందాలు, డప్పులు, బ్యాండు మేళాలతో, బాణా సంచాలతో యల్లారమ్మ గరగోత్సవం సేవ వైభవంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారికి విశిష్ట దర్శనం, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, ఆలయ ఈవో ఎంపీ రామయ్య, ఆలయ కమిటీ సభ్యులు వేల్పూరి జ్యోతి, పరిమి శివసాయి ప్రసాద్, బీవీఎల్ కనక దుర్గా భవానీ, భీమవరపు వీర్రాజు, తాడిపర్తి అంజలి, కొత్తల సోమరాజు, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తిలతో పాటు మండపాక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మండపాకలో విశిష్ట అలంకరణలో యల్లారమ్మవారు

బైక్ రేసింగ్, యువకుడికి గాయాలు

తణుకు: తణుకు పట్టణంలో బైక్ రేసింగ్‌లతో యువకులు రెచ్చిపోతున్నారు. బుధవారం రాత్రి కొందరు యువకులు బైక్ రేసింగ్ చేస్తూ ఆటోను తప్పించబోయి ప్రమాదం చోటు చేసుకుంది. తణుకు మండలం వేల్పూరు వైపు నుంచి కొందరు యువకులు స్పోర్ట్స్ బైక్‌లపై తణుకు వస్తున్నారు. ఈ క్రమంలో వేల్పూరు రోడ్డులోని భాష్యం స్కూలు వద్దకు వచ్చేసరికి ఒక బైకర్ ఆటోను తప్పించబోయి రోడ్డుపై పడి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో సుమారు వంద మీటర్లు మేర బైక్ దూసుకెళ్లడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రయాణీకులు ఆగి మరీ యువకులకు చీవాట్లు పెట్టారు. ఇటీవలి కాలంలో ప్రధాన రోడ్లు వెంబడి ఈ తరహా బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సాధారణ మోటారు సైకిలిస్టులను హెల్మెట్ పేరుతో జరిమానాలు విధిస్తున్న పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి యువకులపై చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

రిటైర్డు డీఎస్పీ గంగరాజు మృతి

అత్తిలి: జైళ్ల శాఖలో పనిచేసి, పదవీ విరమణ చేసిన డీఎస్పీ ముత్యాల గంగరాజు (67) బుధవారం మృతి చెందారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన గంగరాజు జిల్లాతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని పలు కారాగారాల్లో ఆయన పనిచేశారు. గంగరాజు మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

అత్తిలిలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి, వసుధా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో బుధవారం స్త్రీలకు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పట్నాల బసవయ్య, వరాహాలమ్మ జ్ఞాపకార్థం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు(బాబు) ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యబృందం వైద్యపరీక్షలు జరిపారు. లయన్స్‌క్లబ్ జిల్లా ఉప గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు శిబిరాన్ని ప్రారంభించారు. మణిపాల్ ఆసుపత్రి వైద్యురాలు కె హారిక క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కారుమూరి రామలింగేశ్వరరావు, నిమ్మల సూరిబాబు, వర్ధినీడి వెంకటశివ, మద్దాల వెంకటేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణగుప్త, దొడ్డిపట్ల కోటేశ్వరరావు, దాసం బాబ్జి, ఉలుసు భాస్కరరావు, యాతం రాంబాబు, కొరిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగేళ్ల బాలుడి స్కేటింగ్ ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కోచ్ లావణ్య, బాలుడు అభిరామ్

తణుకు అర్బన్: తణుకు మునిసిపల్ స్కేటింగ్ కోర్టులో గురువారం రాత్రి అత్యంత సాహసోపేతమైన స్కేటింగ్ ప్రదర్శనను నాలుగేళ్ల బాలుడు కాటూరి శ్రీయాన్స్ లక్ష్మణ అభిరామ్ ఇవ్వనున్నట్లు స్కేటింగ్ రేంజర్స్ అకాడమీ కోచ్ వి.లావణ్య తెలిపారు. బుధవారం స్కేటింగ్ కోర్టులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వజ్ర రికార్డ్స్, గ్లోబల్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో లింబో స్కేటింగ్ అండర్ ఫైర్ అండ్ గ్లాస్ పీసెస్ బార్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రేపటి కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలుడి తాతయ్య కాటూరి లక్ష్మణరావు, తల్లి తండ్రులు కాటూరి రామప్రసాద్, శ్రీప్రభచంద్ర పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

తణుకు టౌన్: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 42 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సీనియర్ రొటేరియన్, ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు ఆర్థిక సహాయంతో బుధవారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సుధాకర్, చిట్టూరి వెంకటేశ్వరరావు, మేడికొండ వెంకటేశ్వరరావు, గమిని రాంబాబు, డా.ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.